విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 05 ఏప్రిల్ 2025 8 పేజీలు

సైకిల్ స్టాండ్ తొలగింపులో ఉద్రిక్తత

- నిబంధనలకు విరుద్ధంగా కూల్చారంటూ బాధితుడి ఆందోళన
- ఆసుపత్రి సూపరింటెండెంట్, పట్టణ సీఐపై డీఎస్పీకి ఫిర్యాదు
- మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయిస్తానంటూ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : బాపట్ల పట్టణంలోని ఏరియా వైద్యశాల ప్రాంగణంలో ఉన్న సైకిల్ స్టాండ్ తొలగింపులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైసీపీ, టీడీపీ క్యాడర్ ఇరు వర్గాలు ఘటన స్థలంలో నానా హంగామా చేశారు. కక్షపూరితంగా సైకిల్ స్టాండ్‌ను తొలగిస్తున్నారని నిర్వాహకుడు వెంకట్రావుతో పాటు పలువురు వైసీపీ క్యాడర్ ఆసుపత్రి సూపర్‌డెంట్ సిదార్ధతో పాటు పట్టణ సీఐ రాంబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాండ్ నిర్వాహకుడు అతనికి మద్దత్తుగా వచ్చిన వారితో టీడీపీ క్యాడర్.. వాగ్వాదానికి దిగారు. దీంతో ఆ ప్రాంతమంతా గందరగోళం నెలకొంది. ఎప్పటినుంచో సైకిల్ స్టాండ్ నిర్వహిస్తుండగా రోడ్డు విస్తరణకు సహకరించి ఆసుపత్రిలో

మిగతా 2 లో ...

తాగునీటి సమస్యలు రానివ్వొద్దు

- అధికారులే బాధ్యత వహించాలి
- ముందస్తు చర్యలతోనే నివారణ
- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర - ఒంగోలు : వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో వేసవిలో తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అందుకనుగుణంగా మున్సిపల్ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు వేసవిలో తాగునీటి సరఫరాపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, సమస్యాత్మక గ్రామాలను ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో ఆయా గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు.

మండలస్థాయి అధికారులు త్రాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామాలలోని త్రాగునీటి వనరులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని,బోర్ వెల్స్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని, అవసరమైన వాటికి మరమ్మత్తులు చేయించాలన్నారు. ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించేందుకు రక్షిత త్రాగునీటి పథకాలలోని ఫిల్టర్ బెడ్స్‌కు మరమ్మత్తులు చేయించాలన్నారు.

పగటి ఉష్ణోగ్రతలు

మిగతా 2 లో ...

కరెంట్ షాక్‌తో ఇద్దరు మృతి

పోతార్లంక లీలాదుర్గాశంకర్ (ఫైల్)

ఆకుల మహేష్ (ఫైల్)

- విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేస్తుండగా ఘటన
- తృటిలో ప్రాణాలు దక్కించుకున్న మరో నలుగురు
- అందరూ విద్యుత్‌శాఖ సిబ్బందేనని తెలిపిన అధికారులు

విశాలాంధ్ర - కొల్లూరు : విద్యుత్తు లైన్‌ల మరమ్మతుల సమయంలో విద్యుత్తు సరఫరా జరగడంతో ప్రమాదం చోటుచేసుకొని ఇద్దరు విద్యుత్తు శాఖ సిబ్బంది ఇద్దరు విద్యుత్తు ఘాతానికి గురై మృతిచెందిన సంఘటన శుక్రవారం కొల్లూరు మండలపరిధిలోని ఈపూరులో చోటుచేసుకుంది. విద్యుత్తు శాఖ సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలపరిధిలోని దోనేపూడిలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న పోతార్లంక లీలాదుర్గాశంకర్ (51), ఈపూరులో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ఈపూరు సమీపంలోని పంటపొలాలలో విద్యుత్తు లైన్‌లపై తాటిచెట్టు పడి విద్యుత్తు సరఫరాకు అంతరాయం వాటిల్లింది. వెంటనే అప్రమత్తమైన విద్యుత్తు శాఖ ఏఈ ఆరుగురు సిబ్బందితో కలసి విద్యుత్తు లైన్‌ల మరమ్మతులు చేపట్టారు. పనులు చేస్తున్న సమయంలో విద్యుత్తు సరఫరా జరగడంతో విద్యుత్తు ఘాతానికి గురైన లీలాదుర్గాశంకర్, మహేష్‌లు విద్యుత్తు ఫోల్ పైనుంచి కింద పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది వారిని కాపాడేందుకు ప్రయత్నాలు చేపట్టినప్పటికీ లీలాదుర్గాశంకర్ సంఘటనా ప్రాంతంలోనే మృతిచెందాడు. కొన ఊపిరితో ఉన్న మహేష్‌ను కొల్లూరు పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. ప్రమాద సమయంలో విధుల్లో ఉన్న మరో నలుగురు లైన్‌మెన్‌లకు సైతం

మిగతా 2 లో ...

కనిగిరి ఏఎంసీ చైర్మన్‌గా యారవ

కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా యారవ రమాదేవిను నియమిస్తూ టీడీపీ రెండవ జాబితాలో శుక్రవారం ప్రకటించారు. మొదటినుండి రమాదేవి భర్త శ్రీనివాసులు టీడీపీ బలోపేతానికి కృషి చేశారు. 2024 ఎన్నికల్లో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు. ఉగ్ర నరసింహారెడ్డి శ్రీనివాసులు పేరు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ప్రభుత్వం రిజర్వేషన్‌లో మహిళకు కేటాయించడంతో శ్రీనివాసులు భార్య రమాదేవికి చైర్మన్ పదవిని ప్రకటించారు. యాదవ రమాదేవి పేరు ప్రకటించడం పట్ల టిడిపి కార్యకర్తలు, యారవ అభిమానులు మమ్మీ డాడీ సెంటర్ లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

-విశాలాంధ్ర, పామూరు

శ్రీశైలం ఘాట్ రోడ్‌లో కారు దగ్ధం

మండలంలోని శ్రీశైలం ఘాట్ రోడ్‌లో మధ్యాహ్నం కారు మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన సంఘటన శ్రీశైలం ఘాట్ రోడ్‌లో చింతల తుమ్మల బైలు మధ్యలో జరిగింది. గుంటూరు నుండి శ్రీశైలం వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు రావడంతో అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు, గమనించి కారు నుంచి దిగారు. దీంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు, కారు పూర్తిగా దగ్ధమైంది. దోర్నాల ఎస్ఐ వి.మహేష్ సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

-విశాలాంధ్ర, పెద్ద దోర్నాల

పిడుగుపాటుతో మూడు గేదెలు మృతి

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలో గురువారం రాత్రి పిడుగుపాటుకు గురై మూడు గేదెలు మృతి చెందాయి. వివరాలు ప్రకారం గురువారం రాత్రి కొమరోలు మండలంలో అకాల వర్షం కురవడంతో ఆ సమయంలో ఉరుములతో కూడిన పిడుగులు పడి ఎడమకల్లు గ్రామంలో పల్లె యాకోబుకు చెందిన రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదల విలువ రూ రెండు లక్షలు ఉంటుందని యజమాని తెలిపారు. అదే సమయంలో మదనపల్లి గ్రామానికి చెందిన పాణ్యం చిన్న పీరయ్య కు చెందిన గేద సైతం పిడుగుపాటుకు గురై మృతి చెందింది.

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రకు జన్మదిన శుభాకాంక్షలు

టీడీపీ నేత కొప్పుల వెంకటసుబ్బారెడ్డి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర జన్మదిన సందర్భంగా గుంటూరులోని కార్యాలయం నందు దోర్నాల మండల టిడిపి నాయకుడు కొప్పుల వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం ఎమ్మెల్సీ రాజేంద్రనీ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి, శాలువలతో సన్మానించారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'పేస్'లో జెడ్ స్కేలార్ టెక్ క్యాంప్

విశాలాంధ్ర-ఒంగోలు :స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఎడ్యు స్కిల్స్ సహకారంతో జెడ్ స్కేలార్ టెక్ క్యాంప్ పేరుతో మూడు రోజులు నిర్వహించడం జరిగింది. ఈ వర్క్ షాప్ కు రిసోర్స్ పర్సన్ గా జెడ్ స్కేలార్ హైదరాబాద్ నందు సీనియర్ లీడ్ ట్రైనర్గా బాధ్యతలు నిర్వహిస్తున్న మిస్టర్ సాయి వెంకట్ వ్యవహరించారు. ఈ సందర్భంగా వర్క్ షాప్ ప్రారంభ కార్యక్రమంలో సాయి వెంకట్ మాట్లాడుతూ ఈ మూడు రోజులు వర్క్ షాప్ లో విద్యార్థులకు జెడ్ స్కేలార్ జీరో ట్రస్ట్ క్లౌడ్ సెక్యూరిటీ పై అవగాహన కల్పిస్తామని అదేవిధంగా ఉద్యోగ సాధనలో జెడ్ స్కేలార్ యొక్క ప్రాముఖ్యతను ఏ ఏ దేశాలు ఈ సాంకేతికతను తమ రక్షణ రంగంలో ఏ విధంగా ఉపయోగిస్తామో వివరించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి టెక్ క్యాంపులు వలన విద్యార్థులకు ఎంతో గాను నైపుణ్య అభివృద్ధికి ఎంతో గాను ఉపయోగపడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ సి వి సుబ్బారావు, డీన్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఆర్ వీరాంజనేయులు, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ కే రూప అక్కిష్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్ గిరిబాబు, కళాశాల ఎడ్యు స్కిల్స్ కోఆర్డినేటర్ కే రాజ్ కిరణ్, ఈవెంట్ ఆర్గనైజర్ డి జనార్దన్ రెడ్డి మరియు వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

కరెంట్ షాక్‌తో ఇద్దరు మృతి

(మొదటిపేజీ తరువాయి)

విద్యుత్తు షాక్ తగిలినప్పటికీ వారు అప్రమత్తమవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు సంఘటనా ప్రాంతానికి చేరుకొని ప్రమదా కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు, విద్యుత్తు శాఖాధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదం చోటు చేసుకోవడానికి గల కారణాలపై ధర్యాప్తు చేస్తున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ సుధాకర్‌బాబు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం కింద జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి ఆదేశాలతో కొల్లూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లు రూ.10 వేలు చొప్పున మృతుల కుటుంబాలకు అందజేశారు. విద్యుత్తు ఘాతానికి గురై ఇరువురు సిబ్బంది మరణించిన విషయం తెలుసుకున్న వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు దిగ్భాంతికి గురవడంతోపాటు, సంబంధిత శాకా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సమాచారం అందజేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని ఎమ్మెల్యే ప్రకటించారు.

ఘనంగా సమతా దివస్ వేడుకలు

విశాలాంధ్ర-ఒంగోలు : అణగారిన వర్గాలకు సమానత్వం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ నందు శుక్రవారం నిర్వహించిన సమతా దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. హరిబాబు తదితరుల సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏ.కే.యూ సమావేశపు హాలు నందు ఏర్పాటు చేశారు. తొలుత ఏ.కే.యూ ప్రొఫెసర్లు, ఉద్యోగులు అందరూ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమానికి ఏ.కే.యూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కే.వి.ఎన్ రాజు అధ్యక్షత వహించారు. డాక్టర్ రాజు మాట్లాడుతూ ఆనాటి కాలంలో సమాజంలోని ప్రజలు అందరికీ

సమానత్వం కోసం నిరంతరం ఆయన శ్రమించడం జరిగిందని, సమకాలీన వ్యవస్థలో సమూలమైన మార్పుల కోసం, అణగారిన వర్గాల పట్ల వేళ్ళూనుకొని ఉన్న వివక్షతను రూపుమాపేందుకు కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని అన్నారు. విద్య యొక్క ప్రాధాన్యతను సమాజానికి తెలియజేసి, విద్య ద్వారానే సమాజం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని మహాత్మా జ్యోతిరావు పూలే పేర్కొనగా, నాటి సమాజం లోని అన్ని వర్గాల ప్రజలకు సమానత్వాన్ని అందించడం కోసం పోరాటాలు నిర్వహించిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అని డాక్టర్ కే.వి.ఎన్. రాజు కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏ.కే.యూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్ రావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే చురుకైన వ్యక్తిగా ప్రత్యేక గుర్తింపును పొందిన జగ్జీవన్ రామ్ 40 సంవత్సరాల సుదీర్ఘ కాలం రాజకీయాలు నిర్వహించిన ప్రజానేతగా పేరు ప్రఖ్యాతులు పొందినట్లు తెలిపారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, వారి పట్ల ఆనాటి సమాజంలో ఉన్న వివక్షను నిర్మూలించేందుకు పోరాడిన మహనీయుడు జగ్జీవన్ రామ్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. అతిథిగా పాల్గొన్న ఏ.కే.యూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఆర్ అండ్ డి కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్ నిర్మల మణి మాట్లాడుతూ దివంగత మాజీ ప్రధాని జగ్జీవన్ రామ్ తన నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో 30 సంవత్సరాల పాటు కేంద్రంలో వివిధ హోదాలలో, పలు శాఖల్లో మంత్రిగా పని చేశారని, ఆ సమయంలో ఆయన ఏ పదవి చేపట్టినా కూడా ఉన్నతమైన ఆశయంతో పనిచేశారన్నారు.

ఉద్యాన పంటల ఎగుమతులపై మాగుంట ప్రశ్న

విశాలాంధ్ర-ఒంగోలు : గత 5 సంవత్సరాలలో దేశం నుండి ఎగుమతి చేసిన, ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకున్న ప్రధాన ఉద్యాన పంటలు మరియు వాటి ఉత్పత్తుల పరిమాణం మరియు విలువ, ప్రధాన దేశాల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నించారు. దీనికి కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానమిస్తూ మొత్తం వ్యవసాయ ఎగుమతులు రికార్డులను ప్రభుత్వం నిర్వహిస్తుందని, రాష్ట్రాల కోడ్లు ఆధారంగా - ఎగుమతి దారులు ఇచ్చిన బిల్లుల ఆధారంగా రాష్ట్రాల ఎగుమతి లెక్కలు ఉంటుచే రాష్ట్రాల వ్యవసాయ సరుకుల ఎగుమతుల వివరాలు అందుబాటులో లేవని తెలిపారు. 2019-20 నుండి 2023-24 వరకు 9,467.73 యు.ఎస్.మిలియన్ డాలర్ల విలువ గల 2,27,038 టన్నులు ప్రధాన ఉద్యాన పంటలైన : పండ్లు, కూరగాయలు, విత్తనాలు, పూలు మన దేశం నుండి ఇతర దేశాలకు ఎగుమతి జరుగగా, అదేకాలంలో 12,835.93 యు.ఎస్.మిలియన్ డాలర్ల విలువ గల 1,55,706 టన్నులు దిగుమతి జరిగిందని తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, నేపాల్, మలేషియా, అమెరికా సంయుక్త రాష్ట్రాలకు మన దేశం నుండి ప్రధాన ఉద్యాన పంటలు ఎగుమతి జరుగగా, అదేకాలంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఆఫ్ గనిస్తాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇరాన్, చీలే మరియు ఇరాక్ దేశాలనుండి మన దేశానికి దిగుమతి జరిగిందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

సైకిల్ స్టాండ్ తొలగింపులో ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగంలో లేని స్థలంను పాట ద్వారా దక్కించుకుని ప్రతి నెల క్రమం తప్పకుండా రూ.32 వేలు అద్దె చెల్లిస్తుంటే నిబంధనలకు విరుద్ధంగా ఏరియా వైద్యశాల సూపర్‌డెంట్ సిద్దార్ధ సైకిల్ స్టాండ్‌ను తొలగిస్తున్నారని పట్టణ సీఐ రాంబాబు మాపై జులుం ప్రదర్శిస్తూ బలవంతంగా దౌర్జన్యం చేస్తూ షెడ్ తొలగించారని సైకిల్ స్టాండ్ నిర్వాహకుడు నర్రావుల వెంకట్రావు తెలిపారు.

- ఏరియా వైద్యశాల ప్రాంగణంలో పదేళ్ల క్రితం జరిగిన టెండర్లలో నర్రావుల వెంకట్రావు పాట ద్వారా సొంతం చేసుకున్నాడు. అప్పటి నుంచి నిబంధనల ప్రకారం అద్దె చెల్లించుకుంటూ కరోనా సమయంలో కూడా అద్దెను చెల్లించానని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సైకిల్ స్టాండ్‌ను తొలగించాలని ఆసుపత్రి సూపర్‌డెంట్ ఆదేశాలు ఇవ్వగా వెంకట్రావు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో ఈ వివాదం ఉన్నప్పటికీ ఎటువంటి ఆదేశాలు రాకముందే టీడీపీ నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకుని జేసీబీలతో

సైకిల్ స్టాండ్‌ను తొలగించారు. నా పొట్ట కొట్టొద్దు.. నా స్టాండ్‌ను తొలగించొద్దు అని బాధితుడు వెంకట్రావు ఎంత వేడుకొంటున్న అధికారులు, పోలీసులు మాత్రం వెంకట్రావును అక్కడ నుంచి ఈడ్చుకుంటూ వెళ్లారు. అతని మద్దతుగా ఉన్న వైసీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్యతోను దురుసుగా ప్రవర్తించారని తెలుపుతున్నారు. నాపై నమ్మకంతో వాహనాలు ఇక్కడ పెట్టారని వీటి బాధ్యత ఎవరని నాకు లిఖిత పూర్వకంగా ఇవ్వాలని ఎంత ప్రాదేయపడినా అధికారులు, పోలీసులు కనకరించలేదు. జరుగుతున్న అన్యాయాన్ని ఖండించేందుకు వచ్చిన బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జీ గుదే రాజారావు, ప్రజా సంఘాల నాయకుడు తురిమెళ్ల అమ్మేశ్వరరావు, పలువురిని పట్టణ సీఐ రాంబాబు పక్కకు నెట్టి పంపించేశారు. ఆఖరకు బాధితుడు నర్రావుల వెంకట్రావును బలవంతంగా జీపులో వెక్కించుకుని వెళ్లారని బాధితులు తెలియజేశారు.

- సైకిల్ స్టాండ్ తొలగింపులో జరిగిన పరిణామాలపై బాధితుడు నర్రావుల వెంకట్రావు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులుకు వైసీపీ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి సూపర్‌డెంట్ సిద్దార్ధ, పట్టణ సీఐ రాంబాబు, టీడీపీ నాయకుడు గవిని శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేశారు. కోర్టు పరిధిలో ఉన్న సైకిల్ స్టాండ్ వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో గోడలు పగలగొట్టి షెడ్‌ను తొలగించారని పిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా కక్షపూరితంగా నాకు జరిగిన అన్యాయం అధికారులు, పోలీసులు నాపై వ్యవహరించిన తీరుపై మానవ హక్కుల సంఘం దృష్టికి తీసుకుని వెళతానని వెంకట్రావు వివరించారు.

తాగునీటి సమస్యలు రానివ్వొద్దు

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతున్న నేపథ్యంలో వడగాల్పులపై ముందస్తుగా తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్, అధికారులతో సమీక్షిస్తూ, ఎండ తీవ్రత పెరుగుతున్న తరుణంలో ప్రతి గ్రామ పంచాయతీల్లో, మండల కేంద్రాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాలలో అధికంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లు, ఆటో స్టాండ్లు, పబ్లిక్ ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బస్టాప్, పబ్లిక్ ప్రాంతాలలో నీడ ఉండేలా పందిరి వంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు, షామ్యానాలు వంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలలోగా ఎవరు ఎండకు తిరగరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులు, క్యాప్ లు వినియోగించాలన్నారు. ఒదులుగా ఉండే కాటన్ దుస్తులే ధరించాలన్నారు. వడదెబ్బ తగిలిన వారికి తక్షణమే గ్లూకోజ్ వంటివి ఇవ్వాలని, తడిగుడతో తుడవాలని, తదుపరి మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఆస్పత్రిలో, అంగన్వాడీ కేంద్రాల్లో, స్కూల్స్ లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వడదెబ్బ తగిలిన వారికి తక్షణమే వైద్యం అందించేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో ద్రవపదార్థాలు అధికంగా తీసుకోవాలనే విషయాలను ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాల్సి ఉందని జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ డిపిఎం మాధురి, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకట నాయుడు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర రావు, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, డిఎం అండ్ హెచ్ఓ డా. వెంకటేశ్వర్ రావు, డిసిహెచ్ఎస్ డా సూరిబాబు, ఐసిడిఎస్ పిడి హేన సుజన, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, గ్రౌండ్ వాటర్ డిడి విద్యా సాగర్, పశు సంవర్ధక శాఖ జెడి డా. బేబి రాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

రోడ్లపైనే మురుగునీరు

విశాలాంధ్ర-పొన్నలూరు : మండల కేంద్రమైన పొన్నలూరులో మురుగు కాలువలలో పూడిక తీయక పోవటం వలన అవి పొంగి రోడ్లపైకి వచ్చి నిల్వ ఉంటున్నాయి. మురికి కాలువలోనే చెత్త వేయడం వలన అవి నీళ్లు పారుదలను ఆపివేయటంతో మురుగునీరు ఒక్కసారిగా రోడ్లపైకి వస్తున్నాయి. వేలకొద్దీ ఇంటి పన్నులు చెల్లిస్తున్న పంచాయితీ అధికారులు కనీసం సౌకర్యాలు కల్పించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇండ్ల నుంచి రోజు విడుదలవుతున్న మురికి నీరు వ్యర్థాలు భారీ స్థాయిలో చెత్త అటు, ఇటు తిరిగి చివరకు డ్రైనేజీల్లో ఇండ్ల మధ్య పేరుకు పోతున్నాయి. డ్రైనేజీల నిర్వహణలోని బాధ్యతారహితం వల్ల చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో పాటు వాటిని తొలగించడం సమస్యగా మారింది. మురికి కాలువలో మురుగు నిల్వ ఉండటం వలన దోమలు వ్యాప్తి చెంది చుట్టుపక్కల ఉన్న ఇండ్లలోకి ప్రవేశించి కుట్టినచో డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని స్థానికులు తెలుపుతున్నారు. సంబంధించిన అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోని కాలవలో మురుగునీరు వ్యర్థాలు ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికంగా నివసించే ప్రజలు కోరుచున్నారు.

వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : రెవెన్యూలో పని చేస్తున్న గ్రామ సంఘ వీఆర్ఏల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు గంటేన పల్లి శ్రీనివాస రావు అన్నారు. ముండ్లమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్ఏల సంఘం ప్రకాశం జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు ముఖ్యఅతిథిగా హాజరైనారు. వీఆర్ఏల జనరల్ బాడీ సమావేశం వరగాని యేసు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు గంటేనపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వీఆర్ఏలకు తెలంగాణ ప్రభుత్వ తరహాలో పే స్కేల్ అమలు చేయాలన్నారు. నిత్యం అనేక సమస్యలతో అల్లాడిపోతున్నామని అన్నారు. నైట్ డ్యూటీలు వీఆర్ఏలకు వేయరాదని, నామినేలుగా పని చేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలని, అర్హత కలిగిన వారికి వీఆర్వోలుగా, అటెండర్లుగా, వాచ్మెన్‌గా, డ్రైవర్లుగా, రికార్డు అసిస్టెంట్‌గా ప్రమోషన్ ఇవ్వాలని, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా వెట్టి చాకిరిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతుందని అన్నారు. వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి ఈ నెల ఐదవ తేదీన విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య భవన్లో రాష్ట్ర సదస్సు జరుగుతుందన్నారు. ఈ రాష్ట్ర సదస్సుకు ప్రకాశం జిల్లాలోని వీఆర్ఏలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని శ్రీనివాసులు వీఆర్ఏలను కోరారు. అనంతరం వీఆర్ఏల మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షునిగా వరగాని యేసు, మండల కార్యదర్శిగా పొట్లూరి జ్యోతి, మండల కోశాధికారిగా కుమ్మిత నాగార్జున రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా షేక్ మహబూబ్ బాషా, జాయింట్ సెక్రటరీగా తప్పెట కోటయ్య, కమిటీ సభ్యులుగా నూనె కోటేశ్వరరావు, పాలె పోగు కోటేశ్వరరావు, మంగమ్మ, సులోచన, నంబూరు సునీల్, తాతపూడి కోటయ్య, డేవిడ్, ఏమేలమ్మ, గంగరాజు పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొట్టొద్దు

తేళ్ల మనోజ్ కుమార్

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : పాస్టర్ ప్రవీణ్ మృతి అడ్డుపెట్టుకొని కొందరు వ్యక్తులు ప్రభుత్వానికి క్రైస్తవుల మధ్య విభేదాలు సృష్టించే కుట్ర చేస్తున్నారని అలాంటి వారిని తరిమి కొట్టాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్ సూచించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం క్రైస్తవ సంఘ కాపరులకు గౌరవ వేతనం విడుదల చేయడం పట్ల ఉప్పుగుండూరు గ్రామంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో దేవుని కృప ట్రస్ట్ మండల పాస్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కృతజ్ఞత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తేళ్ల మనోజ్ కుమార్ మాట్లాడుతూ క్రైస్తవుల అభివృద్ధికి టిడిపి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఆయన అందరినీ సమానంగా చూడాలన్న దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారని తెలిపారు. గత ఎనిమిది నెలల నుండి పాస్టర్లకు గౌరవ వేతనం నిలిచిపోగా దానిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం చంద్రబాబు నాయుడు నిధులు విడుదల చేయడం క్రైస్తవుల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ పాస్టర్స్ యూనియన్ అభివృద్ధికి చర్చల నిర్మాణాలకు ఎంతో దోహదపడుతున్నారన్నారు. పాస్టర్ల సమస్యలను ఎమ్మెల్యే బియన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. ఇటీవల రాజమండ్రి సమీపంలో జరిగిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిని అడ్డంపెట్టుకొని కొందరు స్వార్థ రాజకీయ నాయకులు క్రైస్తవులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. యూనియన్ కార్యవర్గం మండల పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్‌ను శాలువా కప్పి సత్కరించారు. అతిథులుగా పాస్టర్ పాడి బండ్ల డానియల్ కొరియర్, యూనియన్ అధ్యక్షులు ఎర్రిచర్ల డేవిడ్, సెక్రటరీ గద్దం ఇశ్రాయేలు, కోశాధికారి పారి దావీదు స్థానిక సంఘ కాపరి సుధాకర్ నంబూరి భాస్కర్, ఉసురుపాటి డానియేల్, దెబ్బవరపు దానియేలు మరియు మండల పాస్టర్స్ విరివిగా పాల్గొని ఈ కార్యక్రమంలో జయప్రదం చేశారు.

అమెరికాలో కాసుకు ఎమ్మెల్యే కందుల అభినందనలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కాసు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రముఖ ఎన్నారై కాసు వెంకటేశ్వర్ రెడ్డిని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అమెరికాలోని కాసు నివాసానికి వెళ్లి అభి నందనలు తెలిపారు. కాసు నివాసానికి ఎమ్మెల్యే కందుల రావడం పట్ల వెంకటేశ్వర రెడ్డి ఘనంగా స్వాగతం పలికి ఆహ్వానించారు. ఇటీవల కొనకనమిట్ల మండలంలో జరిగిన కార్యక్రమాలలో కాసు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాసు ట్రస్టు ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలతో పాటు టిడిపి అభివృద్ధి కూడా సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో పార్టీలో మీకు మంచి గుర్తింపు ఇస్తుందని నారాయణరెడ్డి కాసుతో ముచ్చటించారు. స్పందించిన వెంకటేశ్వర రెడ్డి పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొని తమ వంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు .ఎమ్మెల్యే కందుల తమ నివాసానికి రావడం పట్ల గుచ్ఛంఇచ్చి హర్షం వ్యక్తం వ్యక్తం చేశారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు సమన్వయకర్తగా రామారావుకు ఆహ్వానం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఈ ఏడాది డిసెంబర్ మాసంలో 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో జరగనున్న ప్రపంచ తెలుగు మహాసభలకు సమన్వయకర్తగా కొనకనమిట్ల మండలంలోని చిన్నారి కట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుగా పనిచేస్తున్న పొదిలి పట్టణంలోని బాప్టిస్ట్ పాలెంకు చెందిన తాళ్లూరి రామారావుకు ఆహ్వానం అందింది. ఉభయ ప్రకాశం జిల్లాల నుంచి సమన్వయకర్తగా ఆహ్వానం రావడం పట్ల ఏపీటీఎఫ్ యుటిఎఫ్, ఎంఇఎఫ్ ఎమ్మార్పీఎస్ సంఘాల నాయకులు చిన్నారి కట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పలువురు రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేసి, రామారావుకు అభినందనలు తెలిపారు.

సర్పంచి బాలకృష్ణ మృతికి ఎమ్మెల్యే 'ఉగ్ర' సంతాపం

విశాలాంధ్ర-వెలిగండ్ల: మండలం ఇమ్మడిచెరువు గ్రామ సర్పంచ్ తోకల బాలకృష్ణ నిన్న బెంగళూరులో మృతి చెందిన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం ఇమ్మడి చెరువు సర్పంచి తోకల బాలకృష్ణ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. తెలుగుదేశం పార్టీ సర్పంచి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి భరోసా ఇచ్చారు. మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ బాలకృష్ణ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముక్కు పెద్దిరెడ్డి, గవదకట్ల మాలకొండయ్య, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గవదకట్ల హరికృష్ణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోనె ప్రతాప్ కుమార్, ఇమ్మడి చెరువు నీటి సంఘం అధ్యక్షులు ముక్కు వెంకట శ్రీరాములు రెడ్డి, ముక్కు నారాయణరెడ్డి, పెరుగు శివయ్య, టిడిపి ఇతర నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు బాలకృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు.

వార్డు సభ్యుడు వెంకటరావు రాజీనామా

విశాలాంధ్ర - తాళ్లూరు: మండలంలోని కొర్రపాటి వారి పాలెం ఒకటవ వార్డు సభ్యుడు కె.వెంకట రావు గురువారం తన పదవికి రాజీనామా చేసారు. 2021లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో వార్డు సభ్యుడుగా గెలుపొందారు. ఆయన గ్రామ సర్పంచి కొర్రపాటి శ్రీదేవి,రామయ్యలు పంచాయితీలో జరుగు అభివృద్ధి పనులకు అడ్డుకోవటంతో పాటు కనీసం తాగు నీటి పథకాల పనులను కూడ ముందుకు సాగనీయనందుకు, గ్రీన్ అంబాసిడార్స్ జీతాలను ఇవ్వనందుకు, బీసీ కాలనీ రోడ్డు వేయగా ఆ బిల్లుల చెల్లింపులో వివక్ష చూపిస్తున్నందుకు నిరసరనగా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ దార హనుమంతరావుకు కలిసి ఆయన అందజేసారు. రాజీనామా అనంతరం తగ్గు చర్యలకు సిబ్బందికి సిఫార్స్ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

పేరు మార్పు
నేను, రావులపల్లి ఏడుకొండలు (పాతపేరు) (Ravulapalli Yedukondalu)
S/o. రావులపల్లి నారాయణ నివాసం 4-68B, సమంతపూడి, నిమ్మరెడ్డిపాలెం, ప్రకాశంజిల్లా, ఆంధ్రప్రదేశ్. నేను నా పేరును
రావులపల్లి విక్రమ్ సాయి శ్రీనివాస్ యాదవ్ (క్రొత్తపేరు)
(Ravulapalli Vikram Sai Srinivas Yadav) గా మార్చుకున్నాను. ఇకనుండి నేను
రావులపల్లి విక్రమ్ సాయి శ్రీనివాస్ యాదవ్ గా
(Ravulapalli Vikram Sai Srinivas Yadav)
వ్యవహరించబడతాను.

విశాలాంధ్ర epaper.visalaandhra.com శనివారం 05 । ఏప్రిల్ । 2025

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - ఒంగోలు టౌన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ లపై జరుగు అత్యాచారాల కేసుల పరిశీలన, నివారణ చర్యల కొరకు ఏర్పడిన జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటిని ఎంపిక చేయవలసిన ఉన్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి ఎన్ లక్ష్మా నాయక్ తెలిపారు. ఎస్సీ,ఎస్టీ (నాన్ అఫిషియల్ మెంబర్స్) అనధికార సభ్యులు 5 ఖాళీలు, ఎస్సీ, ఎస్టీలు కాని ఇతర కులములకు చెందిన వారు (ఎన్ఐజిఓ)లు 3 ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. కావున షేడ్యూల్ కులములు, షేడ్యూల్ తెగలుకు చెందిన సామాజిన సేవా దృక్పధం, పౌర హక్కుల చట్టం, అత్యాచార నిరోధక చట్టాలపై అవగాహన కలిగి ఉండి,, ఆసక్తి మరియు సేవా భావం కలిగిన వారు ఇది వరకు చేపట్టిన సాంఘిక సేవా కార్యక్రమాల వివరాలతో బయోడేటా ను జర పరచి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులు ఈ నెల 15 లోగా జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి కార్యాలయానికి చేరే విధంగా పంపాలని కోరారు. ప్రభుత్వ మరియు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలతో పనిచేయు వారు అనర్హులని ఆయా కేటగిరిలలో ఎంపికయిన వారికి ప్రభుత్వం నుండి ఎటువంటి గౌరవ వేతనం ఉందదని జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి లక్ష్మానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

వైఎస్ షర్మిలను కలిసిన కైపు

విశాలాంధ్ర - తాళ్లూరు: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డిని ఆపార్టీ సంఘటిత కార్మికుల, ఉద్యోగుల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చైర్మన్ దర్శినియోజక వర్గ ఇన్చార్జి కైపు వెంకట క్రిష్ణా రెడ్డి శుక్రవారం కలిసారు. పార్టీ అభ్యున్నతికి చేస్తున్న కృషిని వివరించారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని తిరునాళ్లకు ఆహ్వాన పత్రికను అందించారు. పలు సమస్యలపై చర్చించినట్లు కైపు క్రిష్ణా రెడ్డి తెలిపారు.

ఉపాధి హామీ పనులు చేపట్టండి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : జాతీయ ఉపాధి హామీ పథకం కూలీ పనులను పగడి బందిగ చేపట్టాలని ఎంపీడీవో డి.సురేష్ బాబు ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు బుధవారం జరిగిన ఎంజిఎన్ ఆర్ఈజిఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం జరిగింది. మాట్లాడుతూ పనులను పక్కగా వేగవంతంగా నిర్వహించాలని. ప్రతి ఒక్కఉపాధి కూలీకి 300 రూపాయలు కూలి పడేలా వారికి కొలతలు ఇవ్వాలన్నారు. ఫారం పాండ్స్ మంజురైన వాటికి వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా పశువుల నీటి తొట్లు పనులను కూడా వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో వాసంతి, ఈసీ బాబు టిఏలు రామకృష్ణ రాజ్ కుమార్ చెన్నమ్మ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్‌కు కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి వ్యవసాయ కళాశాలల క్రీడా పోటీలలో మొదటిస్థానంలో రాణించి జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ మీట్ ఎంపికైన సిఎస్ పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో మే నెల రెండో తేదీ నుండి ఐదో తేదీ వరకు జరిగే ఆల్ ఇండియా వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలలో పాల్గొనేందుకు ఆచార్య ఎన్.జి .రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వారి ఆధ్వర్యంలో కె.యమున రెండో సంవత్సరం, మునయ్య మూడో సంవత్సరం, యస్.సుదేవులను సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్, కెవియన్ ఎల్ ప్లస్ కళాశాల చైర్మెన్ ఇరగని చలపతి రావు,అసిస్టెంట్ ప్రొఫెసర్ సుస్మిత, ఫిజికల్ మాస్టర్ బండారు రవీంద్రబాబు, డి.మాలకొండయ్య పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కోసం కొనుగోలు కేంద్రాలు

గొట్టిపాటి లక్ష్మీ

విశాలాంధ్ర-ముండ్లమూరు : రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. మండలంలోని పసుపు గళ్ళు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం నందు శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే కొనుగోలు కేంద్రాల లక్ష్యమని ఆమె అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని ఆమె అన్నారు. తూకాలలో మోసాలు, ధరలలో తేడాలు లేకుండా రైతులకు న్యాయం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలు నిర్వహించే నిర్వాహకులు ఎలాంటి అవతలకు పాల్పడకుండా రైతులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. రైతుల నుండి ఫిర్యాదులు అందితే వెంటనే ఆ ఏజెన్సీ ని రద్దుచేసి మరో ఏజెన్సీకి అప్పుజెప్పడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారాలోకేష్, వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చం నాయుడు, రైతుల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్నారన్నారు. ఈ ఏడాది రైతులకు సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇవ్వగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ మండల అధ్యక్షులు సోమపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, మాజీ జెడ్పిటిసి వరగాని పౌలు, కొక్కెర నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు పందుగుల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇందూరి పిచ్చిరెడ్డి, డిసి అధ్యక్షులు కంచు మా టి శ్రీనివాసరావు, లాయర్ రంగ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

విశాలాంధ్ర-పెద్దారవీడు : గొబ్బూరు - తోకపల్లి గ్రామాల మధ్యలో జాతీయ రహదారిపై గురువారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో తుఫాను వాహనానికి కుక్క అడ్డు రాగా తప్పించబోయి, తుఫాన్ వాహనం తిరగబడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న 13 మందిలో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ప్రమాదాన్ని గమనించిన వెనకాల వస్తున్న లారీ డ్రైవర్ సడన్గా అతని లారీని నడిరోడ్డుపై ఆపి, తుఫాన్ వాహనంలోని వారిని రక్షించాలని డ్రైవరు మరియు క్లీనరు ఇద్దరు కిందకు దిగి తూఫాన్ వాహనం దగ్గరికి వెళుతుండగా, అదే సమయంలో లారీ వెనకాల వైపు నుండి వస్తున్న మిరపకాయల లోడు డీసీఎం వాహనం డ్రైవర్, వర్షం కారణంగా, చీకటిగా ఉన్న కారణంగా, కనిపించని లారీని గుద్దగా డీసీఎం వాహనంలో ఉన్న ఇద్దరు మిర్చి రైతులు డ్రైవర్‌కి గాయాలయ్యాయి. వీరిలో ఖాసీం అనే మిర్చి రైతు చనిపోగా, మరొక మిర్చి రైతుని మరియు డీసీఎం వాహన డ్రైవర్ని మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పిల్లలను పెంచడం ఎలా? అది ఒక కళ'పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పామూరు : పిల్లలను పెంచడం అది ఒక కళ అని మోటివేటర్ బి.సైరస్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ మార్క్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో పిల్లలను పెంచడం ఎలా? అది ఒక కళ అను అంశంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలు ఎలా ప్రవర్తిస్తారు, వారిని తల్లిదండ్రులు ఎలా పెంచాలి, సెల్ భూతం నుండి ఎలా కాపాడుకోవాలని సైరస్ కుమార్ అవగాహన కల్పించారు.పిల్లలు సున్నిత మనస్కులని, వారిని ఇతరులతో పోల్చ కూడదని ,వారి భవిష్యత్ కోసం ప్రణాళికలు రచించుకునేలా సలహాలు ఇవ్వాలని సైరస్ కుమార్ సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో ఎలా ప్రవర్తించాలి, వారి భవిష్యత్ లక్ష్యాలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సైరస్ కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఎం జయకుమార్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

అమెరికాకు భారత ఫార్మా ఉత్పత్తులు తప్ప

మరో ప్రత్యామ్నాయం లేదు

- గర్వనీయంగా ఎన్డీయే ప్రభుత్వ విధానాలు
- ప్రధాని మోదీ చొరవకు కృతజ్ఞతలు
- బీజేపీ రాష్ట్ర నాయకులు ఏలూరి రామచంద్రారెడ్డి వెల్లడి

విశాలాంధ్ర-మార్కాపురం : అమెరికా ప్రతీకార సుంకాల నుంచి భారత ఫార్మా ఉత్పత్తులకు మినహాయింపు ఇవ్వడం ప్రధాని నరేంద్ర మోదీ పనితీరుకు నిదర్శనమని బీజేపీ రాష్ట్ర నాయకులు, ఎస్సార్సీ ల్యాబొరేటరీస్ అధినేత డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. విదేశీ ఉత్పత్తులపై ఇటీవల భారీగా సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మొత్తం 60 దేశాల కంపెనీలపై వివిధ రకాల సుంకాలు విధించారని అన్నారు. మన దేశం ఎగుమతి చేస్తున్న 90 శాతం జనరిక్ ఔషధాలపై కూడా అమెరికా 27 శాతం టారిఫ్ విధించినట్టు చెప్పారు. అయితే రెండు రోజులు గడవక ముందే జనరిక్ మందుల తయారీ విషయంలో భారత్ పాత్రను గుర్తించారని, దీంతో అమెరికాలో ఈ ఔషదాల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని సుంకాలు విధించే నిర్ణయం వెనక్కి తీసుకోవడం జరిగిందని అన్నారు. ఇదంతా జనరిక్ ఔషధాల తయారీకి మోదీ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహమే అని తెలిపారు. పైగా భారత్‌పై సుంకాలు విధిస్తే లక్షలాది మంది అమెరికన్ ప్రజలకు మెడికల్ బిల్లులు పెరిగే అవకాశం ఉందని అన్నారు. అమెరికన్ వైద్యులు సూచించే ప్రతి 10 జనరిక్ ఔషధాల్లో 9 భారత్ నుంచే అమెరికాకు దిగుమతి అవుతున్నాయని అందువల్ల నిర్ణయం వెనక్కి తీసుకోవడం మినహా అమెరికాకు మరో ప్రత్యామ్నాయం లేదని అన్నారు. మరోవైపు అమెరికాలో జనరిక్ ఔషధాలపై సుంకాలు విధించకపోవడం వలన భారత్‌లో ఫార్మా రంగానికి ఊరట లభిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఒక శాస్త్రవేత్తగా, ఫార్మారంగానికి చెందిన పారిశ్రామికవేత్తగా ప్రధాని మోదీ తీసుకున్న చొరవకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ నిర్ణయంతో భారత్ నుంచి ఫార్మా ఎగుతులు ఘనసీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. అదే క్రమంలో అమెరికా ఎగుమతులు కూడా పెరుగుతాయని జోశ్యం చెప్పారు. మోదీ చొరవ కారణంగా రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడనున్నాయని ఆయన అన్నారు. ప్రస్తుతం అమెరికాలో నెలకొన్న అనిశ్చితి కూడా త్వరలో తొలగిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా అమెరికాలో నివసిస్తున్న భారతీయులకు ఊరట కలిగిస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి అన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పించాలి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అధికారులకు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నాటు సారా నిర్మూలన జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జేసీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాటుసారా తయారు చేసే గ్రామాలను గుర్తించాలన్నారు.జిల్లాలో నాటుసారా నిర్మూలనకు గ్రామ స్థాయి,మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు చెప్పారు.ముందుగా గ్రామాల్లో నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.నాటు సారా తయారు చేయడంలో మార్పులు రానట్లయితే గ్రామాలలో తయారీదారులపై దాడులు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో పోలీస్,ఎక్సైజ్ శాఖ,అటవీ శాఖ అధికారులు సమన్వయముతో పని చేసి నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలన్నారు.నాటు సారా తయారీదారులు మానుకున్నట్లయితే వారి జీవనోపాధులు మెరుగుపరచడానికి గిరిజన సంక్షేమశాఖ ద్వారా బ్యాంకు రుణాలు అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరిండెంట్ వెంకటేశ్వరరావు,జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా అటవీ శాఖ అధికారి భీమా నాయక్,ఎక్సైజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినీలకు సైకిళ్ళు పంపిణీ

విశాలాంధ్ర - అద్దంకి : నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.శుక్రవారం అద్దంకి ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6,7 తరగతులు చదువుతున్న 309 మంది విద్యార్థినిలకు అస్టిండియా సహకారంతో ఉచితంగా సమకూర్చిన సైకిళ్లను మంత్రి పంపిణీ చేశారు.మంత్రి మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదివి తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరారు.కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్,ఎంపీడీవో సింగయ్య, అసిస్ట్ ఇండియా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

చుక్కా కుటుంబాన్ని పరామర్శించిన గాదె

విశాలాంధ్ర - పర్చూరు : పర్చూరులోని నెహ్రూ కాలనీకి చెందిన చుక్కా శామ్యూల్ కుమారుడు వంశీ(26) ఇటీవల చీరాలలోని సముద్ర స్నానానికి స్నేహితులతో కలిసి వెళ్లారు.అలల తాకిడికి వంశీ మృతి చెందాడు.శుక్రవారం పర్చూరు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన రెడ్డి శామ్యూల్ కుటుంబాన్ని పరామర్శించి వంశీకి నివాళులు అర్పించారు. శామ్యూల్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మధుసూదన్ రెడ్డి తెలిపారు.వారితో పాటు వైసీపీ నాయకులు కోటా శ్రీనివాసరావు,కఠారి అప్పారావు,గేరా స్వరాజ్ తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధిపై లబ్ధిదారులకు క్రెడిట్ క్యాంపు

విశాలాంధ్ర - యద్దనపూడి : కలెక్టర్ ఆదేశాల మేరకు యద్దనపూడి మండలం పరిధిలో గల 14గ్రామ పంచాయతీలకు 2024-25 ఆర్థిక సంవత్సరం బీసీ ఈ.డబ్ల్యూ.ఎస్ కాపు,మేదరి,కుమ్మరీలకు స్వయం ఉపాధి కింద మండలంలోని పంచాయతీలలోని లబ్దిదారులకు క్రెడిట్ క్యాంపు నిర్వహించినట్లు ఎంపీడీవో పిటివి కృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి కోసం ఓబిఎంఎంఎస్ సైట్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు క్రెడిట్ క్యాంపు నిర్వహించడం జరిగిందని,ఉదయం 11 గంటలకు యద్దనపూడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి,బ్యాంకు మేనేజర్స్,ఈఓపిఆర్ఆర్‌డి సమక్షంలో క్రెడిట్ క్యాంపుకి అర్జీదారులు హాజరైనట్లు తెలిపారు.మండల పరిధిలో వెనకబడిన తరగతులు ఈడబ్ల్యూఎస్‌కు సంబంధించిన బీసీ వర్గాల 16 పథకాలకు 31 లక్షలు, ఈడబ్ల్యూఎస్ కింద 8 పథకాలకు 14 లక్షల మంజూరు అయ్యాయని తెలిపారు. బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్‌గా రమేష్

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంతమాగులూరు మండలం కుందుర్రు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు తేలప్రోలు రమేష్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. తేలప్రోలు రమేష్ సంతమాగులూరు మండలంలో సీనియర్ తెలుగుదేశంపార్టీ నాయకునిగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందారు.ఈ సందర్భంగా తనకు ఏఎంసీ చైర్మన్‌గా నియమాకానికి కృషి చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి,టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు తేలప్రోలు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.తేలప్రోలు రమేష్‌కు ఏఎంసీ పదవిరావడంపై మండలంలోని టీడీపీ అభిమాను లు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

వేమూరు ఏఎంసీ చైర్మన్‌గా పూర్ణకుమారి

విశాలాంధ్ర - వేమూరు : వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా అమృతలూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ సీనియర్ టీడీపీ నాయకు రాలు గొట్టిపాటి పూర్ణకుమారి నియమితుల య్యారు.ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన రెండో జాబితాలో వేమూరు యార్డు చైర్మన్‌గా గొట్టిపాటి పూర్ణకుమారి పేరు ప్రకటించారు.ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాలకవర్గ సభ్యుల నియామకంతో కలిగిన జాబితాను అధిష్టానానికి అందించారు. ఎట్టకేలకు రెండో జాబితాలో వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పేరు ఖరారు కావడంతో టిడిపి నేతలు ఆనందం వ్యక్తపరిచారు.

బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం కార్యదర్శిగా 'రావూరి'

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రాష్ట్ర బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం కార్యదర్శిగా స్థానిక పరశురామ బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు రావూరి ఆంజనేయులు ఎన్నిక కాబడ్డారు.రాష్ట్ర కార్యదర్శిగా ఆయనను ఎన్నుకోవడం ఆ సంఘానికి మరింత పేరు ప్రతిష్టలు ఇనుమడుంప చేస్తారని ఆశాభావాన్ని సంఘ సభ్యులు వ్యక్తపరిచారు.ఆయన ఎన్నిక పట్ల శుక్రవారం మండల కేంద్రంలో పలువురు సంఘ సభ్యులు,పురోహితులు ఆయనను కలిసి పూల మాలలు,దుశ్యాలవులతో సత్కరించి అభినందనలు తెలిపారు.మండల కేంద్రంలో పరుశురామ సేవా సమితి స్థాపించి ఎన్నో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహించి ఎందరో పేద బ్రాహ్మణులను ఆర్థికంగానూ సామాజికంగానూ ఆదుకున్న గొప్ప వ్యక్తి రావూరి అని వక్తలు కొనియాడారు.ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడంతో తన బాధ్యత మరింత పెరిగిందని, ఈ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.సంఘ అభివృద్ధి కొరకు నిరంతరం శక్తి వంచన లేకుండా కృషి చేస్తూనే ఉంటానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి సభ్యులలు చావలి శ్రీధర్ శర్మ,మల్లెల కృష్ణమూర్తి,నూతలపాటి భాను ప్రసాద్,వేదాంతం రంగనాథ ఆచార్యులు, అచ్యుతుని మణి,అన్నదాన సత్యనారాయణ, పివీఎస్ ఆంజనేయ శర్మ,బొమ్మిడి శ్రీనివాసరావు, కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

మునిసిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డులలో శుక్రవారం మునిసిపల్ కమిషనర్ జి.రఘునాధ రెడ్డి పర్యటించారు.జిబిసి రోడ్డు ప్రధాన రహదారి వెంబడి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. వార్డుల నందు నిర్వహిస్తున్న పారిశుధ్యం గురించి శానిటరీ ఇనిస్పెక్టర్లతో మాట్లాడారు. పారిశుధ్య మెరుగుదలకు తీసుకోవలసిన అంశాలను చర్చించారు.దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను గురించి వారికి కొన్ని సూచనలు చేశారు.సచివాలయ పారిశుద్ధ్య విభాగ కార్యదర్శులు ప్రతిరోజు తమ సచివాలయ పరిధిలో పారిశుధ్యం గురించి నేరుగా ప్రజలను అడిగి వివరాలు తెలుసుకోవాలన్నారు.హోమ్ కంపోస్టింగ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.29వ వార్డు బెస్తపాలెం నందు త్రాగునీటి సరఫరా గురించి నేరుగా ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.సరఫరా అయ్యే నీటి నమూనాలను స్వయంగా పరిశీలించారు.వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మునిసిపల్ ఇంజనీర్ వారిని ఆదేశించారు. లీకులను గుర్తించి వెంటనే వాటిని బాగు చేయాలన్నారు.అనంతరం సూర్యలంక రోడ్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.వారి వెంట మునిసిపల్ ఇంజనీర్ ఎస్ఎస్అర్ కృష్ణా రెడ్డి,శానిటరీ ఇనిస్పెక్టర్ సి. హెచ్ కరుణా,పురపాలక సంఘ సిబ్బంది,సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేడు బింగినిపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ మండల పరిధిలోని బింగినిపల్లి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం బింగినపల్లి అభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల మరియు విజయవాడ అనిలా హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ నాయకులు నూకసాని బాలాజీ శుక్రవారం ఒక ప్రత్యేక సమావేశంలో తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో కింది వివిధ విభాగాల్లో నిపుణులచే ఉచిత వైద్య సేవలు అందించబడతాయి, శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు జరుగుతాయని, ఈ కార్యక్రమానికి ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొంటారు. కనుక ఈ అవకాశాన్ని నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు.పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కర్లపాలెం మండలంలో అర్హులైన ఐదు మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం సీఎం నారాచంద్రబాబునాయుడు సంక్షేమ నిధి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి వచ్చిన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అందజేశారు.చెక్కులు తీసుకున్న వారిలో నక్కల గోపిచంద్,మల్లారపు వాసు దేవరావు,దబ్బకూటి నాగయ్య,గూడూరి శేషగిరిరావు, షేక్ జమిల్లా బేగంలు ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు: సీఐ వెంకట్రావు

విశాలాంధ్ర - బల్లికురవ : ఈనెల 12వ తేదీన నక్కబొక్కలపాడు ఈర్ల గంగమ్మ వార్షిక తిరుణాల మహోత్సవం సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ వెంకట్రావు హెచ్చరించారు.శుక్రవారం ఈర్ల గంగమ్మ గుడి వద్ద ప్రభలు కట్టే ప్రదేశాలను గుడి ప్రదేశాలను ఆయన పరిశీలించారు.తిరుణాల ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఎవరికి నిర్దేశించిన ప్రదేశాలలో వారు ప్రబలను ఏర్పాటు చేసుకోవాలనరు.ప్రబల వద్ద సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన నిర్దేశించిన సమయానికి నిలిపివేయాలన్నారు.తిరుణాల సందర్భంగా ఎవరైనా తాగి అల్లర్లు సృష్టించిన,ప్రజలకు ఇబ్బందులు కలిగించిన ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.ప్రశాంతమైన వాతావరణంలో తిరునాళ్ల జరిగే విధంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు.ఈయన వెంట ఎస్సై జీవి చౌదరి ఉన్నారు.

30 నుంచి శ్రీబగళాముఖి అమ్మవారి తిరునాళ్లు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయంలో వార్షికంగా జరిగే తిరునాళ్ళ మహోత్సవం ఈ నెల 30 నుండి మే 4వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగాలని,మే 5వ తేదీ సోమవారం శ్రీ అమ్మవారి పుట్టినరోజు మహోత్సవం జరపాలని అమ్మవారి ఆలయ తిరునాళ్ళకు సంబంధించిన ఐదు గ్రామాల ప్రజలు ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి సమక్షంలో శుక్రవారం ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ సందర్భంగా చందోలు, కుంచలవారి పాలెం,భవనంవారిపాలెం,సంగుపాలెం,కోడూరు గ్రామాల నుండి ఆయా గ్రామ పెద్దలు ఆలయంలో విచ్చేసి తమ అభిప్రాయాలను ఆలయ అర్చకుల సమక్షంలో ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి తెలియజేశారు.గ్రామ పెద్దల సూచనలు సూచించిన విషయాలు తప్పనిసరిగా అమలు చేయడానికి ప్రయత్నిస్తానని ఈ ఉత్సవాలు చాలా ఘనంగా జరపడానికి అన్ని గ్రామాల పెద్దల సహకారం కావాలని కోరారు.ఈ విషయమై మరొక మారు ఈనెల 20 వ తేదీన ఐదు గ్రామాల గ్రామ పెద్దలు సమావేశం కావాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించాలని ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు.

ఘనంగా పఠాన్ రాజేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు, గుంటూరు డివిజన్ రైల్వే బోర్డు మెంబర్ పఠాన్ రాజేష్ జన్మదిన సందర్భంగా టీడీపీ నాయకులు అంబేద్కర్ సర్కిల్ వద్ద ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.బాపట్ల నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి పరిచయం ఉన్న వ్యక్తి ఎటువంటి కల్మషం లేకుండా ప్రతి ఒక్కరిని నవ్వుతూ పలకరించే మంచి మనిషి అని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో జేజేఎఫ్ అధ్యక్షులు జంగా జ్యోతి ప్రసాద్,చింతా కిషోర్,గవిని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జనార్ధన్‌రెడ్డిని కలిసిన వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : రోడ్లు,భవన నిర్మాణ శాఖ మంత్రి బీ.సీ జనార్ధన్ రెడ్డిని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పలు రోడ్లు వెడల్పు,అభివృద్ధిపై మంత్రికి వినతిపత్రం అందజేశారు.బాపట్ల నుండి పర్చూరు రోడ్డు,చందోలు నుండి తెనాలి రోడ్డు, కర్లపాలెం నుండి గణపవరం వయా పెద్దపులుగువారిపాలెం రోడ్డు, చందోలు వంతెన నుండి నిజాంపట్నం రోడ్డు,భవనంవారిపాలెం నుండి ఖాజీ పాలెం వయా దమ్మన్నవారిపాలెం రోడ్లు వెడల్పు,అభివృద్ధి చేయాలని మంత్రికి వివరించారు.

ఎమ్మెల్సీ ఆలపాటికి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర - బాపట్ల : ఉమ్మడి కృష్ణ - గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెనాలి పట్టణం చెంచుపేట అగ్రికల్చర్ యార్డులో ఆలపాటి శివరామ కృష్ణయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో జరిగిన ఒంగోలు జాతి ఎద్దల బల ప్రదర్శన పోటీలు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా తెలుగు జాతికి ఆయువుపట్టు

రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : తెలుగు వారి వైభవానికి బాపట్ల ముత్యాల పందిరి వేసిందని ఏపీ మానవ వనరుల అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి తెలిపారు.బాపట్ల జిల్లా తృతీయ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో జరిగింది.సభకు ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డబ్ల్యూ ఏజికె మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా తెలుగు జాతికి ఆయువుపట్టు లాంటిదని తెలుగు రాష్ట్ర అవతరణకు ఇక్కడే పునాదులు పడ్డాయన్నారు.తెలుగు సాహిత్యం ఇక్కడే ఓనమాలు దిద్దుకుని తెలుగు పద్యం తెలుగు లిపి కూడా బాపట్ల జిల్లాలోనే పురుడు పోసుకుందన్నారు. తెలుగు తల్లికి కూడా బాపట్లే పుట్టినిల్లు ఆంధ్రుల చరిత్ర కూడా బాపట్ల జిల్లాలోనే ప్రారంభమైందన్నారు.ఆంధ్ర మహాభారతాన్ని బాపట్లకు చెందిన ఎర్రాప్రగడ గట్టెక్కించారని అద్దంకి చెందిన పద్య కవి డివిఎం సత్యనారాయణ తెలిపారు.బౌద్ధానికి పెద్దపీట వేసి,ఆచార్య నాగార్జునుడి జన్మస్థలంగా భాసిల్లుతున్నది బాపట్ల జిల్లా అని ఆయన వివరించారు.అనంతరం జిల్లా ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా డి.చక్రపాణిని బాపట్ల మాజీ మున్సిపల్ కౌన్సిలర్,సుశీల కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ పేర్ల సునీల్ కుమార్,బాపట్ల మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జిట్టా కన్యాకుమారిలు పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి,సెర్ప్ కార్యదర్శి సిహెచ్ పార్థసారథి,ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, ఉపాధ్యాయ నాయకులు గురజాల శ్రీనివాసరావు,తెలుగు పండితులు పరిమి సుబ్రహ్మణ్యం శాస్త్రి,విశ్రాంత రైల్వే ఉద్యోగి మానం అప్పారావు,నాయకులు ఉమా రెడ్డి రామారావు,సీనియర్ సిటిజన్స్ నాయకులు జీవి బ్రహ్మం,శ్రీహరి రావు,బందా బాబు,జన విజ్ఞాన వేదిక కార్యదర్శి యాజలి భాస్కరరావు,యోగా గురువు ధూళిపాళ్ల శైలజ,చిత్రకారుడు జీవి, రావూరి నరసింహ వర్మ,మాజీ సైనికుల సంఘం నాయకులు కృష్ణారావు,విశ్రాంత తహసీల్దార్ సత్యనారాయణ,విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

యాదవ సామాజికవర్గంపై కూటమి కపట ప్రేమ

వైసీపీ మండల కన్వీనర్ ఏడుకొండలు

విశాలాంధ్ర - కర్లపాలెం : కోర్టు పరిధిలో ఉన్న అంశంపై ఒక యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి బాపట్ల ప్రభుత్వ వైద్యశాలలో సైకిల్ స్టాండ్ నడుపుకొని బ్రతుకుతూ ఉంటే అధికారపక్షం అండతో బీసీలపై అత్యంత కర్కశంగా వ్యవహరించిన తీరు ఎంతో దారుణమని కర్లపాలెం మండల వైసీపీ కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు ధ్వజమెత్తారు.శుక్రవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సైకిల్ స్టాండ్ కాంట్రాక్టర్ వెంకటరావుకు చెందిన షెడ్డును జెసిబిలతో దారుణంగా తొలగించి అతని జీవనోపాధిపై దెబ్బ కొట్టిన అధికార పార్టీపై ఏడుకొండలు మండిపడ్డారు. ఇదేనా మీరు బీసీల పట్ల చూపించే ప్రేమ అని బీసీలకు ఎప్పుడు తెలుగుదేశంపార్టీ ద్రోహం చేస్తూనే ఉన్నది అనేదానికి ఇదే ఉదాహరణ అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వెంకట్రావు సైకిల్ స్టాండ్ నిర్వహిస్తూ దాని గడువును పొడిగించాలని కోర్టును ఆశ్రయించిన కూడా ఆ అంశం మీద ఇంకా కోర్టు ఎటువంటి తీర్పు వెలువరించక ముందే దౌర్జన్యంగా జెసిబిలు తీసుకొని వెళ్లి తన జీవనోపాధిపై దెబ్బతీశారని దీనిని బీసీ సామాజిక వర్గం ఎట్టి పరిస్థితుల్లో సహించదన్నారు.కోర్టు తీర్పు వచ్చేవరకు తన జోలికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని లేదంటే బీసీ సామాజిక వర్గం ఉద్యమిస్తుందన్నారు.వెంటనే ఇటువంటి కక్షపూరిత చర్యలు ఆపకపోతే బీసీ సామాజిక వర్గం తగిన విధంగా బుద్ధి చెబుతుందని హెచ్చరించారు.

పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుంజి వెంకట్రావు

విశాలాంధ్ర - పర్చూరు : పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పావులూరుకు చెందిన ఇంకొల్లు మాజీ జడ్పిటిసి సభ్యులు గుంజి వెంకట్రావు నియమితులయ్యారు.ఈ మేరకు తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు,సీఎం చంద్రబాబు నియామక ఉత్తర్వులు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి గుంజి వెంకట్రావుకు శుభాకాంక్షలు తెలిపారు.అన్నదాతల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలన్నారు.అన్నదాతల అభ్యున్నతికి అనునిత్యం బాసటగా నిలవాలని సూచించారు.రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ లక్ష్యాలు రైతుల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉపాధి హామీ సిబ్బందికి సన్మానం

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన సిబ్బందికి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనసన్మానం నిర్వహించారు. ఎంపీపీ కామూరి అమూల్య మాట్లాడుతూ ఏపీవో ఎం మహాలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు కటారు శ్రీనివాసులు, ఎం లక్ష్మిరెడ్డి, సంగటి కోటిరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు గుప్తా, కృష్ణమోహన్‌లు మండలంలో విలువైన సేవలు అందించారని, తాము బదిలీపై వెళ్లిన చోట సైతం మంచి సేవలు అందించి, ప్రజలకు ఉపయోగపడాలని ఆమె సూచించారు. తాటిచెర్ల ఎంపీటీసీ కామూరి శ్రీనివాసరెడ్డి,ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందచేయాలి

విశాలాంధ్ర-పొన్నలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కొండా బత్తిన మాధవ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధవ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందజేయాలని అధికారులకు సూచించారు. జడ్పిటిసి బెదవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకంలో అవినీతి జరుగుతుందని ఏపీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా జరిగితే మేము పై అధికారుల దృష్టికి తీసుకొని వెళదామని ఎంపీడీవోకు తెలియపరిచారు. అనంతరం గతంలో కాంగ్రెస్ హయాంలో సుమారు 20 సంవత్సరాల క్రితం కట్టుకున్న ఇండ్లకు కూడా దరఖాస్తులు చేసుకున్నారని హౌసింగ్ ఏఈ దృష్టికి తీసుకొని వచ్చారు. హౌసింగ్ ఇండ్లల్లో అవినీతి జరక్కుండా చూడాలని ఏఈకి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి సుజాత, ఆయా శాఖ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవంను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-గిద్దలూరు : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఈ నెల 6 తేదీన పార్టీ ఆవిర్భవించి 46వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పట్టణ అధ్యక్షులు అపిశెట్టి ఉదయ్‌శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాపట్ల పురపాలక సంఘం

"స్వల్ప వ్యవధి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

RocNo: 261/2025/E1 Dt : 04-04-2025

బాపట్ల పురపాలక సంఘమునకు సంబంధించిన అభివృద్ధి పనులను చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు విధానము ద్వారా అర్హతగల రిజిష్టరు కాంట్రాక్టరు దారుల నుండి టెండర్లు కోరబడుచున్నవి. ఇతర వివరములకు www.tender.apeprocurement.gov.in (procurement place) వద్ద చూడగలరు మరియు ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో సంబంధిత విభాగమునందు అడిగి తెలుసుకొనగలరు.

పనుల సంఖ్య : 12

అంచనా విలువ : రూ.47,94,995/-

1) టెండరు బిడ్‌లు ప్రారంభపు తేది	: ది.04-04-2025 సాయంత్రం 05.00గం॥లకు
2) టెండరు బిడ్‌లు వేయుటకు ఆఖరు తేది	: ది.08-04-2025 సాయంత్రం 04.00గం॥లకు
3) టెండరు బిడ్‌లు స్వీకరించు చివరి తేది	: ది.08-04-2025 సాయంత్రం 05.00గం॥లకు

కమీషనర్
బాపట్ల పురపాలక సంఘం

బడి వయస్సు పిల్లలు బడిలో ఉండాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : బడి వయస్సు పిల్లలందరూ బడిలో ఉండేలా, వారిలో రక్తహీనత లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టరు శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె అధ్యతన జిల్లా స్థాయి బంగారు బాల్యం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఈ నెలలో పాఠశాలలు ముగుస్తున్నందున పిల్లలు వేసవి సెలవుల అనంతరం తిరిగి వచ్చేలా ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేసారు. డ్రాప్అవుట్ లేకుండా చూడాలని ఆదేశించారు. ఎవరైనా పిల్లలు బడి మానివేస్తే అందుకు గల కారణాలను కూడా నిర్దిష్టంగా పరిశీలించాలన్నారు. పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలలో అవసరమైన టాయిలెట్లు, గ్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. ఈ నెల 8వ తేదీ నుంచి 25వ తేదీ వరకు 7వ విడత పోషణ్ పక్వాడా కార్యక్రమం ఉన్నందున పిల్లలలో పోషకాహార లోపాన్ని నివారించడం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె చెప్పారు. కిషోరి బాలికల ఆరోగ్యము, ఆహార, జీవన శైలి, వ్యక్తిగత పరిశుభ్రతపైన ప్రత్యేక అవగాహన కల్పించాలని కలెక్టరు ఆదేశించారు. పాఠశాలలో అయితే ఈ దిశగా అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా మహిళా టీచర్లను గుర్తించాలని చెప్పారు. డ్రాపవుట్ పిల్లలు ఉన్నట్లయితే వారికి కూడా ఆయా విషయాలలో అవగాహన కల్పించేలా ప్రత్యేక మెంటార్లను గుర్తించాలన్నారు.

రక్తహీనత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ కార్డు లేని చిన్న పిల్లలకు సత్వరమే వాటిని జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బంగారు బాల్యం సాధన దిశగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టరు ఆదేశించారు. బంగారు బాల్యం కార్యక్రమానికి స్కోచ్ అవార్డు వచ్చినందుకు కమిటీ సభ్యులు ఈ సందర్భంగా కలెక్టరును సన్మానించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ హీనా సుజన్, ఆర్డీవో లక్ష్మి ప్రసన్న, డీఎంహెచ్ఓ వేంకటేశ్వర్లు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, బీసీ సంక్షేమ అధికారి అంజల, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారధి, దివ్యాంగ సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, డీఈఓ కిరణ్ కుమార్, డీపీఓ వెంకట నాయుడు, జడ్పీ సీఈఓ చిరంజీవి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రి దేవి, డీసీహెచ్ఎస్ సూరబాబు,స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, డీఆర్డీఏ పీడీ నారాయణ, డీసీపీఓ దినేష్ కుమార్, ఆర్ఐఓ సైమన్ విక్టర్, బంగారు బాల్యం నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, సార్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఆర్. సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర-మార్కాపురం : ప్రకృతి వ్యవసాయం తోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మండల వ్యవసాయ అధికారి దేవి రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దేవిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరమని, పెట్టుబడి తగ్గడంతో పాటు దిగుబడులు సాధించవచ్చన్నారు. వెలుగు సిబ్బంది సహకారంతో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కలిసికట్టుగా ప్రకృతి వ్యవసాయంపై మరింత విస్తృతంగా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారుచేసి ప్రతి గ్రామ సంఘం పరిధిలో స్వయం సహాయ సహకార సంఘాల ద్వారా ప్రతి రైతు సాగు చేయబడు మొత్తం విస్తీర్ణము ,పంట పేరు నమోదు చేయాలన్నారు. పంట నమోదు చేస్తే ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు వీలవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ లలితమ్మ, రవీంద్రారెడ్డి, వివోఏలు, వివిఏలు, మహిళా రైతులు పాల్గొన్నారు.

6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-పామూరు రూరల్ :ఈనెల 6 వ తేదీన భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం ను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు ఉమ్మడిశెట్టి శ్రీను పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పండగ వాతావరణం లో గ్రామాలలో జెండాలు ఆవిష్కరించాలన్నారు. బిజెపి కార్యకర్తల ప్రతి ఇంటిపై జెండా ఎగరాలని కార్యకర్తలకు శ్రీను పిలుపునిచ్చారు.

గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం

విశాలాంధ్ర- చీమకుర్తి : చీమకుర్తి ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ మీటింగ్ వీటీపీఎస్ రామతీర్థంలో శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పలు గ్రానైట్ ఓనర్స్ అందరూ కలిసి గ్రానైట్ పై ఉన్నటువంటి సమస్యలపై చర్చించడం జరిగింది. ఫ్యాక్టరీ నుంచి బిల్లు లేకుండా వెళ్లేటువంటి వాహనాలను అధికారులు స్విచ్ చేస్తున్నారని తరలించే వారిపై కంటే కూడా ఫ్యాక్టరీలకు వచ్చి వారు కేసులు రాస్తున్నారని వాటిపై మనం చర్చించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కాట్రగడ్డ రమణయ్య మాట్లాడుతూ గత సమావేశంలో వేరే రాష్ట్రాల నుంచి వచ్చి ఫ్యాక్టరీలు నిర్మించినటువంటి ఓనర్స్ను ఈ సమావేశానికి పిలుచుకు రావాలని చెప్పిన తీసుకురాకపోవటం కారణం ఏమిటని అన్నారు. కందిమళ్ళ గంగాధర్, పంగులూరు సురేష్, ఎర్రగుంట్ల ప్రసాదు, కే. రాధాకృష్ణ, సి.హెచ్. మస్తాన్, మండలంలో ఉన్న ఫ్యాక్టరీ ఓనర్స్ అందరూ పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-కురిచేడు : మండలంలోని పడమట వీరాయపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చ పూర్ణచంద్రరావు అధ్యక్షతన వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల వార్షిక నివేదికను తెలియజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఎంతగానో అలరించాయని అన్నారు. ప్రధానోపాధ్యాయులు పచ్చ పూర్ణచందర్రావుని సత్కరించారు. ముఖ్యఅతిథిగా క్లస్టర్ ఇన్ఛార్జి వైఎస్సీ హెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయిని మాధవీ యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు గౌరవాధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ ఏపీటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజా రాంతుల్లా జిల్లా కార్యదర్శి సిహెచ్ శివరామకృష్ణ ఎస్ఎంసి చైర్మన్ కోటేశ్వరరావు, షేక్ మహబూబ్ బాషా,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అల్లినగరం హైస్కూల్లో బాబుజగజీవన్రామ్ జయంతి

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని అల్లినగరం శ్రీ మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి అధ్యక్షతన బాబు జగజీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 5 శనివారం రోజు బాబు జగజీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం సెలవు ప్రకటించినందున ముందస్తుగా శుక్రవారం నాడు బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు బాబు జగజీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి మాట్లాడుతూ బాబు జగజీవన్ రామ్ గొప్ప స్వాతంత్ర సమరయోధుడని విద్యార్థి దశలోనే మహాత్మా గాంధీ అహింస మార్గమును ఎంచుకొని 1930లో స్వాతంత్ర ఉద్యమం చేపట్టారని తెలిపారు. అంటరానితనం నిర్మూలనకు ఎంతో కృషి చేశారని 50 సంవత్సరాలు పార్లమెంటు సభ్యులుగా 30 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా భారతదేశ ఉప ప్రధానిగా పనిచేసి భారతదేశానికి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. 1967లో డాక్టర్ ఆఫ్ సైన్స్ గౌరవ డాక్టరేట్ అవార్డు పొందారని, 1968 లో కాన్పూర్ విశ్వ విద్యాలయం డాక్టరేట్ తో సత్కరించిందని పేర్కొన్నారు. భారతదేశ ప్రజలు గర్వించదగ్గ అమూల్యరత్నం బాబు జగజీవన్ రామ్ అని ఆయన ఆశయాలను భారతదేశ ప్రజలు విద్యార్థులు కొనసాగించాలని ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట నారాయణ కోటేశ్వరరావు, చంద్రమోహన్, ప్రకాశరావు శివరాం, సిబ్బంది పకీరయ్య అశ్విని విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్లాక్ పబ్లిక్ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండలం బండ్లమూడి పీహెచ్సీలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ కేర్ సెంటర్ను సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి.ఎన్. విజయకుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బండ్లమూడి పీహెచ్సీలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ కేర్ సెంటర్ ను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని మన ప్రభుత్వం వచ్చిన తరువాత వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కూడా ముందుంటున్నామని అలాగే పబ్లిక్లో వచ్చేటువంటి వ్యాధులను సవ్యంగా ట్రీట్ చేయడానికి ఈ బ్లాక్ పబ్లిక్ హెల్త్ కేర్ సెంటర్ ఉపయోగపడుతుందని వీటికి కావాల్సిన నిధులను కూడా అందుబాటులోకి తీసుకొస్తామని ఇది డివిజన్కి చాలా మేలు చేసేదని అలాగే గ్రామంలో ఉన్నటువంటి హరిజనవాడలో వాటర్ ట్యాంక్ నిర్మాణం ప్రతి ఇంటికి కొళాయి ద్వారా నీరందించడం లాంటి కార్యక్రమాలు కూడా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ రమణయ్య, కందిమల్ల గంగాధర్, ఎడ్లపల్లి రాంబ్రహ్మం, మన్నం ప్రసాదు, గ్రామ టిడిపి నాయకులు వనిపెంట శ్రీనివాస్ రెడ్డి, పొదిలి వెంకటేశ్వర్లు, ఎమ్మార్వో బ్రహ్మయ్య, ఎండిఓ రాఘవేంద్ర, డాక్టర్స్ నర్సులు,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : వృద్ధులకు కుటుంబ సభ్యులకు సీనియర్ సిటిజన్స్కు శుక్రవారం నాగులుప్పలపాడు సచివాలయంలో సిఐ ఎన్ శ్రీకాంత్ బాబు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చట్టాలపై అవగాహన కల్పించి వారికి ఏదైన సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్లో కాని 100 కి ఫోన్ చేసి వారి సమస్యను తెలపవచ్చు అన్నారు. వృద్దులు ఇబ్బంది పడుతున్నట్లు ఎవరి దృష్టికి వచ్చిన పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు వృద్ధులను ఎవరైన ఇబ్బందులకు గురిచేసిన చో చర్యలు తీసుకుంటామన్నారు అదే విధంగా శక్తి యాప్ మీద మహిళలకు మహిళా పోలీసులకు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు మహిళలు శక్తి యాప్ ద్వారా వారి సెల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవడం వలన కలిగే ప్రయోజనాలు ఆపదలో పోలీసు ద్వార రక్షణ ఎట్లా పొందవచ్చోతదితర అంశాలపై వివరించారు అదేవిదంగా అదేవిదంగా మహిళా చట్టాలు మోక్షజ్ఞ పట్ల అవగాహన కల్పించి వారికి ఏదైన అవసరమైతే వెంటనే పోలీస్ స్టేషన్లొ పిర్యాదు చేయాలన్నారు ఎదైన సమస్యల వలన మహిళలు పిల్లలు ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలన్నారు శక్తి యాప్ నందు పిల్లలు తప్పి పోయిన, యూవ్ టీజింగ్ చేస్తున్న ఎడల వెంటనే సమాచారాన్ని యాప్ ద్వారా తెలపవచ్చు అన్నారు గ్రామాల్లో ఏదైన అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న ఎవరైన మహిళలను ఇబ్బందులకు గురిచేసిన ఈయాప్ ద్వార తెలియచేస్తే వారి మీద కఠినమైన చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ శ్రీకాంత్ బాబు మహిళలకు భరోసా కల్పించారు.

ఈకార్యక్రమంలో, తిరపతిరెడ్డి, మహిళలు మహిళా కానిస్టేబుల్ పరమేశ్వరి ,మహిళా పోలీసులు మాధురి ,సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ బాలకృష్ణ మృతికి దద్దాల సంతాపం

విశాలాంధ్ర-వెలిగండ్ల: మండలం ఇమ్మడిచెరువు పంచాయతీ సర్పంచ్ తోకల బాలకృష్ణ నిన్న బెంగళూరులో మృతి చెందిన విషయం విదితమే విషయం తెలుసుకున్న కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ప్రకాశం జిల్లా జడ్పీటీసిల సంఘం అధ్యక్షుడు వైఎస్ఆర్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గుంటక తిరుపతిరెడ్డి వైసీపీ మండల నాయకులతో కలిసి శుక్రవారం తోకల బాలకృష్ణ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మృతికి సంతాపం తెలిపారు. మండల వైసీపీ నాయకులు మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ కటికల వెంకటరత్నం, నాగూర్ యాదవ్, సర్పంచ్ శ్యామల కృష్ణ రెడ్డి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సుబ్రమణ్యం,రామన భాస్కర్ రెడ్డి, వెంకట్రామయ్య, ఆవుల తిరుపతిరెడ్డి, పల్నాటి శివరామిరెడ్డి, సర్పంచి తాతపూడి సురేష్ బాబు, ఎస్సీ నాయకులు అనిల్ కుమార్ వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు అభిమానులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com శనివారం 05, ఏప్రిల్ 2025

చంద్రబాబు నేతృత్వంలో
దేశానికే నవ్యాంధ్రప్రదేశ్ ఆదర్శం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర - యద్దనపూడి : ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో నవ్యాంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు ,ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు.శుక్రవారం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం మంగళగిరిలో కుప్పం నియోజకవర్గ పార్టీ ముఖ్య కార్యకర్తల సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం పార్టీ బలమైన కంచుకోటగా నిలిచిందన్నారు.కార్యకర్తలు,నేతల సమన్వయం కృషితో పార్టీ విజయ పథంలో ముందుకు సాగుతుందన్నారు.పార్టీ అధినేత,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సీఎం చంద్రబాబు అందించిన ఘనత కుప్పం నియోజకవర్గ ప్రజలదేనన్నారు. రాష్ట్రానికి రోజుకు 20 గంటలు పని చేసే సత్తా శక్తి ఉన్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రమే పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీకి కుప్పం నియోజకవర్గంలో కంచుకోటగా ఉందని రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలను కంచుకోటగా తయారు చేస్తామన్నారు. ఎమ్మెల్యే సాంబశివరావు సూచించిన ప్రధాన అంశాలు చంద్రబాబు నాయుడు అంకితభావం, ప్రజా ప్రేమ,కృషి అన్నీ ఈ తొమ్మిది నెలల పాటు జరిగిన మహత్తర పాదయాత్రలో స్పష్టంగా కనిపించాయి. చంద్రబాబు నేతృత్వం కింద రాష్ట్రాభివృద్ధికి దారి చూపే ఈ పాదయాత్ర,ప్రజలతో ఆయన బంధాన్ని చూపించే చిరస్థాయి గుర్తుగా నిలిచిపోతుందన్నారు. ప్రజలకు నిజమైన అభివృద్ధి ఎవరు చేయగలరో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.నూతన వ్యూహాలతో ముందుకు సాగడం,పార్టీ భవిష్యత్తు ప్రణాళికలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రతి కార్యకర్త కూడా కృషి చేయాలని సూచించారు.కుప్పంలో టీడీపీకి తిరుగులేదని దీమా,స్థానికంగా టీడీపీ బలోపేతానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో నేతలు, కార్యకర్తలు పాల్గొని అభిప్రాయాలు వ్యక్తం చేశారు.పార్టీ తమ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు

- పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు

విశాలాంధ్ర - వేమూరు : పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి కే.ప్రభాకర్‌రావు పంచాయతీ అధికారులను హెచ్చరించారు.శుక్రవారం మండల కేంద్రమైన వేమూరు గ్రామంలో డిపిఓ ప్రభాకర్‌రావు ఆకస్మికంగా పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు,డంపింగ్ యార్డు పనితీరుపై అసంతృప్తిని వ్యక్తపరుస్తూ నియోజకవర్గ కేంద్రంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉందని ఈవోపీఆర్డీ, పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్త పరిచారు. వేమూరులోనే పనితీరు సక్రమంగా లేకపోతే మండలంలోని ఇతర మైనర్, మేజర్ గ్రామాల్లో ఇంకెంత అధ్వానంగా ఉండి ఉంటుందో అని ప్రశ్నించారు. గ్రామాల్లో పర్యటించి విధి నిర్వహణలో సక్రమంగా పనిచేయాలని పంచాయతీ విస్తరణాధికారికి సూచించారు.

తక్షణమే గ్రామాల్లోని డంపింగ్ యార్డులను పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రతి గ్రామంలో పారిశుధ్య విషయంలో కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. త్వరలో మరోసారి పర్యటిస్తానని పని తీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి పంచాయతీకి సంపద పెంచే పద్ధతిలో చర్యలు తీసుకోవాలన్నారు.పంచాయతీ కార్యాలయంలో సచివాలయాల సిబ్బంది సమావేశాన్ని ఏర్పాటు చేసి తగు సూచనలు అందజేశారు.వేసవిలో పంచాయతీ సాధారణ నిధుల ద్వారా తీసుకోవలసిన చర్యలను తెలిపారు.గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని,అదేవిధంగా చలివేంద్రల ఏర్పాటు కూడా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివన్నారాయణ,సర్పంచ్ సజ్జ శ్రీలక్ష్మీ తిరుపతమ్మ,ఇన్చార్జి కార్యదర్శి నవరాణి పాల్గొన్నారు.

ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరపాలి

విశాలాంధ్ర - రేపల్లె : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సంతాపం తెలియజేస్తూ సమగ్ర దర్యాప్తు చేయవలసిందిగా కోరుతూ రేపల్లె పాస్టర్ల శుక్రవారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ పగడాల మృతిపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని అంటూ నినాదాలు చేస్తూ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఆర్ఇఎఫ్ విద్య సంస్థల అధినేత డాక్టర్ బిషప్ ఇమ్మానియేల్ రెబ్బ,ఏఈఎల్‌సి చర్చి డెలిగేట్ జి.ప్రశాంత్ కుమార్,ట్రెజరర్ కె.అజయ్,చర్చ్ పాస్టర్ పుట్ట అబ్రహం, వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ నాయకులు చిత్రాలు ఓబేదు,రెబ్బ జాన్‌పాల్,జై భీమ్ భారత్ పార్టీ బాపట్ల జిల్లా కన్వీనర్ న్యాయవాది రమేష్ రాంజీ,సిపిఎం పార్టీ రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో గత నెల24 వ తేదీన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి,వారి యొక్క మరణం యావత్తు తెలుగు రాష్ట్రాల వారి యొక్క హృదయాలను చాలా గాయపరిచిందని, మృతికి పలు కోణాల్లో అనుమానాలు వ్యక్త పరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గం పరిధిలోని పలు మండలాల,గ్రామాల చర్చి పాస్టర్లు,సంఘ పెద్దలు ర్యాలీలో పాల్గొన్నారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు.

శక్తి యాప్‌పై విస్తృత అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల : తక్షణ పోలీస్ సహాయం కోసం మహిళలు శక్తి యాప్ వినియోగించుకునే విధానం గురించి జిల్లాలోని శక్తి బృందాలు విస్తృత అవగాహన కల్పిస్తున్నాయి.జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు బాపట్ల పట్టణ ఎస్సై చంద్రావతి ఆధ్వర్యంలోని శక్తి బృందం శుక్రవారం బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థినిలకు శక్తి యాప్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సుమారు 200 మంది విద్యార్థినిలు పాల్గొన్నారు.కొందరు విద్యార్థినీలను ఎంపిక చేసి వారితో శక్తి వారియర్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి గ్రూప్ యొక్క ప్రత్యేకతలను వివరించారు.ఈ సందర్భంగా మహిళా ఎస్ఐ మాట్లాడుతూ శక్తి యాప్ మహిళా భద్రత కొరకు రూపొందించబడిందన్నారు. శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే క్షణాల్లో సమీపంలోని పోలీసులకు సమాచారం చేరుతుందన్నారు.ఫోన్ లొకేషన్ ఆధారంగా 10 నిమిషాల్లో పోలీసులు బాధితుల వద్దకు చేరుకొని వారికి భద్రత కల్పిస్తారన్నారు.దీనిలోని హ్యాండ్ షేక్ ఆప్షన్ ను ఇనేబుల్ చేసుకుంటే ఆపద సమయంలో ఫోన్‌ను షేక్ చేస్తే చాలు దగ్గరలోని పోలీసులకు సమాచారం వెళుతుందన్నారు.మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో యాప్‌లోని సేఫ్ ట్రావెల్ అను ఆప్షన్ ఎంచుకొని దానిలో ఎక్కడ నుండి ఎక్కడికి వెళుతున్నారు అను వివరాలు నమోదు చేస్తే వెళుతున్న మార్గాన్ని కంట్రోల్ రూమ్ నుండి ట్రాక్ చెయ్యబడుతుందన్నారు. ప్రతి మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు .అత్యవసర సమయంలో మహిళల రక్షణకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు. మన భద్రత మన చేతుల్లోనే ఉందని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - అద్దంకి : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమాల్లో నియోజకవర్గంలోని 89 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.1 కోటి 38 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.మంత్రి మాట్లాడుతూ సీఎం సహాయ నిధి ద్వారా ఎన్నో కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా నిలుస్తున్నారన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు.బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం భరోసానిస్తుందన్నారు.

డ్రైనేజీలు,కల్వర్టులు నిర్మించాలి:శివప్రసాద్

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నాయకుడు శివ ప్రసాద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో మురుగునీటిపారుదల డ్రైనేజీల నిర్మాణం లేకపోవటంతో మురుగునీరు వీధులలో దర్శనమిస్తున్నాయి.పట్టణ ప్రజల ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ బైక్‌పై పర్యటించి వివిధ వార్డుల్లో ఉన్న మురుగు నీరు డ్రైన్లు లేకుండా ఉండటం గమనించారు.కల్వర్టుల నిర్మాణం,డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలి అని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి సమస్య ఉన్నచోట వెంటనే స్పందించాలని,మురుగునీటిపారుదల డ్రైనేజీలను,కల్వర్టును నిర్మించవలసిందిగా అధికారులకు సూచించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలను పరిగణలోకి తీసుకోవాల్సిందిగా శివప్రసాద్ అధికారులకు విన్నవించారు.

రేపల్లె ఏఎంసీ చైర్మన్‌గా అనురాధ

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా రేపల్లె నియోజకవర్గం జనసేనపార్టీ సమన్వయకర్త మత్తి భాస్కరరావు సతీమణి అనురాధను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్ పదవి ఓసి మహిళకు కేటాయించడంతో ఆస్థానంలో అనురాధ పేరును కూటమి ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి మండలం మత్తివారిపాలెం గ్రామానికి చెందిన అనురాధ చైర్మన్‌గా నియమితులయ్యారు. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో రేపల్లె పట్టణ వైసీపీ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి సతీమణి గడ్డం కోటేశ్వరమ్మ ఓసి మహిళ కోటాలో మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా పని చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జనసేనపార్టీ తరఫున అనురాధను మార్కెట్ యార్డు అధ్యక్షురాలుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

చీరాల ఏఎంసీ చైర్మన్‌గా జనార్ధన్‌రావు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చీరాల ఏఎంసీ చైర్మన్‌గా సీనియర్ టీడీపీ నాయకుడు,ఆ పార్టీ బీసీ సెల్ కార్యదర్శి కొతరపు జనార్ధన్‌రావును నియమించారు. ఈ సందర్భంగా కొతరపు జనార్ధన్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య సహకారంతో తనను ఏఎంసీ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.